సచివాలయాలు వెలవెల

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సేవల్లో కోత
- 12 నెలలుగా అందని పథకాలు
- గ్రామీణ ప్రజలకు తప్పని ఇబ్బందులు



పెద్దనేలటూర్ గ్రామ సచివాలయం

గోనెగండ్ల : జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగించారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలున్న చోటనే ప్రభుత్వ సేవలు అందేలా కృషి చేశారు. ప్రతి సచివాలయానికి వివిధ శాఖలకు సంబంధించి ఉద్యోగులను నియమించి అన్ని రకాల సేవలందించారు. అంతకంటే మెరుగ్గా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కనపెట్టి సేవలకు కోతలు పెట్టింది. నాడు కళకళలాడిన సచివాలయాలు నేడు సేవలు అందక బోసిపోయాయి.

నామమాత్రపు సేవలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 నెలలు కావస్తున్నా ఒక్క ప్రభుత్వ పథకం కూడా అందక, సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు అవసరమైన రేషన్ కార్డుల వెబ్‌సైట్ మినహాయించి, కొత్త పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ తెరుచుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువపత్రాలు, వన్‌బీ అడంగల్ వంటి కొన్ని సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రూ.40 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టింది. మండలంలో 20 గ్రామ పంచాయతీలకు గానూ 23 సచివాలయాలు ఏర్పాటు చేశారు. పల్లెల్లోనే సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలను ప్రజలకు నేరుగా ఇంటి వద్దకే అందజేశారు. ప్రజలకు వీలున్నప్పుడే సమస్యలను విన్నవించేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, పోలీస్, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయ తదితర సేవలు వివిధ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు పల్లెల్లోనే పొందేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది. దీంతో సచివాలయాలు వెలవెల బోయాయి.

దిష్టిబొమ్మల్లా మారాయి



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయాంలో సచివాలయాలన్నీ దిష్టిబొమ్మల్లా మారాయి. ఎన్నికల్లో చెప్పిన హామీలను ఇప్పటి వరకూ అమలు చేయలేదు. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు, సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. – మునిస్వామి, అలువాల

అందుబాటులోకి తీసుకురావాలి



సచివాలయాల్లో రేషన్ కార్డులతో పాటు ఆరోగ్య శ్రీ కార్డులు, నూతన పింఛన్ దరఖాస్తు వెబ్‌సైట్ తెరచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 12 నెలలవుతున్నా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. సచివాలయాలన్నింటిని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. – చికెన్ రాజా, గోనెగండ్ల

నెలరోజులుగా తాగునీరు అందడం లేదు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దపెండేకల్లు, చిన్నపెండేకల్లు, బసరకోడు, అలసందగుత్తి, సలకలకొండ, సాంబగల్లు, నెట్టేకల్లు గ్రామాల్లో నెల రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదని, మమ్మల్ని మనుషులుగా ప్రభుత్వం చూడడం లేదని ప్రజలు సీపీఎం పాదయాత్ర బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దతుంబళం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మూడోరోజు మంగళవారం ఆయా గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శివర్గ సభ్యులు జె.రామాంజనేయులు, ఉచ్చీరప్ప, మండల నాయకులు అయ్యప్ప మాట్లాడుతూ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే పోరాటమే ఏకైక మార్గమని, అందుకోసమే తమ పార్టీ 22 గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తోందన్నారు. ఈనెల 14వ తేదీన ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో సీపీఎం కార్యదర్శులు శ్రీనివాసులు, రంగనాథ్, రామాంజనేయులు, నాయకులు గోపాల్, మునిస్వామి, భీమాంజనేయులు, లక్ష్మన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాలీవానకు మఠం నేలమట్టం


కుప్పకూలిన శరణ గురుబసవలింగ తాత మఠం

నందవరం : మండల కేంద్రం నందవరం – నాగలదిన్నె రోడ్డులో వెలసిన శ్రీ బసవ గురుబసవలింగ తాత మఠం సోమవారం రాత్రి వీచిన గాలీవానకు నేలమట్టమైంది. రాత్రి భారీగా ఈదురు గాలులుతో కూడిన వర్షం కురవడంతో రాతి స్తంభాలు, పైన కప్పిన రేకులు కూడా కుప్పకూలాయి. మఠంలో ఎవరూ లేక పోవడంతో ఎటువంటి నష్టం జరగలేదు. భారీగా గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తుడడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


చిన్న ఏసన్న (ఫైల్)

గోనెగండ్ల : మండల పరిధిలోని కులుమాల గ్రామానికి చెందిన చిన్న ఏసన్న(39) అనే వ్యక్తి ఉపాధి పనులు చేస్తూ గుండెపోటుతో మృతిచెందాడు. కులుమాల గ్రామానికి చెందిన చిన్న ఏసన్నకు భార్య సువర్తమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో ఉపాధి పనులకు ఏసన్న హాజరయ్యాడు. ఉపాధి పనుల్లో భాగంగా కాలువలో పూడిక తీత పనులు చేస్తుండగా గుండెపోటు వచ్చి కింద పడ్డాడు. గమనించిన తోటి కూలీలు ఆస్పత్రికి తీసుకెళ్లమని అనుకుమేలోపు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉపాధి హామీ సిబ్బంది ఏసన్న ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఏసన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని మొట్టి వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా ఆక్టివిటీ కార్యదర్శి బందెనవాజ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ నిధులతో స్థానిక మొట్టి వీధిలో సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యత తగ్గకుండా రోడ్డును వేయాలని కంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభం, నదిముల్లా, సత్తార్, మాబు వలి, బందె, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

ఆదోని రూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆదోని డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నహరివాణం గ్రామంలో రేషన్ బియ్యం ప్రజలకు సక్రమంగా అందడం లేదన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, వెంకటేష్, కృష్ణమూర్తి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో రాజీపడేదే లేదు

ఆదోని అర్బన్: ఆదోని రైల్వేస్టేషన్‌లో అమృత రైల్వేస్టేషన్ పేరుతో జరుగుతున్న నిర్మాణాల్లో రాజీపడేదే లేదని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్ అన్నారు. మంగళవారం అమృత్ రైల్వేస్టేషన్ పనులను బీజేపీ నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఆదోని రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను రూ.9 కోట్లతో రెండేళ్ల క్రితం ప్రారంభించారన్నారు. అయితే నిర్మాణ పనుల్లో వాడుతున్న వస్తువుల్లో నాణ్యత లోపం ఉన్నట్లు అనేక ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ విషయంపై రైల్వే ఉన్నతాధికారులకు, ఆదోని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు నాగార్జున, మహాదేవ్, చెన్నబసప్ప, సన్నప్ప, కోసిగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనం పెంచాలి

ఆదోని రూరల్: అంగన్‌వాడీల వేతనం నెలకు రూ.26 వేలకు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, సీఐటీయూ పట్టణాధ్యక్షుడు తిప్పన్న డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మె నోటీసును మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు అందించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు వరలక్ష్మి, పద్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ఫాంపాండ్లు తవ్వించుకోవాలి


హనుమాపురం పరిధిలో ఫాంపాండ్ పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరమణయ్య

పెద్దకడబూరు : జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులందరూ తమ పొలంలో ఫాంపాండ్స్ తవ్వించుకోవడానికి ముందుకు రావాలని పీడీ వెంకటరమణయ్య సూచించారు. మంగళవారం ఆదోని క్లస్టర్ ఆకస్మిక తనిఖీలలో భాగంగా మండల పరిధిలోని హనుమాపురం గ్రామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న రెండు ఫాం పాండ్ పనులు, ఎల్ఎల్‌సీలో పూడికతీత పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పడిన వర్షపు నీటిని ఫాంపాండ్‌లో ఒడిసి పట్టుకోవడం ద్వారా పంటలకు వాడుకోవచ్చునన్నాడు. అదేవిధంగా 5ఎకరాలలోపు పొలం ఉన్న రైతులు పండ్లతోటలు పెంచుకోవడానికి ముందుకు వస్తే ఉపాధి హామీ పథకం కింద ఎకరానికి (మూడు సంవత్సరాలకు) రూ. 2లక్షల వరకు ఉచితంగా ఇస్తామన్నారు. 28రకాల పండ్లమొక్కలు ఉన్నాయని పండ్ల తోటలు పెంచుకోవడానికి రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లోకేశ్వర్, ప్లాంటేషన్ మేనేజర్ నందకిషోర్, ఈసీ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఉపాధి పనులు లక్ష్యాలు పూర్తి చేయాలి

కోసిగి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేటాయించిన లక్ష్యాన్ని పకడ్బందీగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆ శాఖ జిల్లా పీడీ వెంకటరమణయ్య సూచించారు. మంగళవారం కోసిగికు వచ్చిన ఆయన స్థానిక కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్, పీల్డు అసిస్టెంట్స్‌లతో సమావేశమైయ్యారు. గ్రామాల్లో ఫాంపాండ్స్, హార్టికల్చర్, ఇంకుడు గుంతలు పనులు చేయించాలన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీడీ లోకేశ్వర్, ఇన్‌ఛార్జ్ ఏపీఓ ఖాలిక్, ఉన్నారు.

ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టి సారించాలి


అధికారులతో వాగ్వాదం చేస్తున్న పాలకవర్గ సభ్యులు,


పాలకవర్గ సభ్యులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ చైర్మన్ మహమ్మద్‌గౌస్

ఆదోని టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని కౌన్సిలర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. వేసవికాలం కావడంతో తాగునీటి సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం విడనాడాలని కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, ఉస్మాన్, రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీయాదవ్, అశోక్, ఫయాజ్‌అహ్మద్, అశోక్ అధికారులను కోరారు. వేసవికాలం, పెళ్లిళ్లు, దేవరలు, శుభ, అశుభ కార్యక్రమాలకు ట్యాంకర్ తెచ్చుకున్న వారికి ఉచితంగా తాగునీరు సరఫరా చేయాలని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, ఉస్మాన్, అశోక్, బాలాజీయాదవ్, రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని తప్పనిసరిగా ఇవ్వాలని, ఆ మేరకు కౌన్సిల్ తీర్మానం చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయంలో అవినీతి జరుగుతోందని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు ట్యాంకర్లతో నీటిని తీసుకెళ్తుంటారని, వాటిని దృష్టిలో పెట్టుకుని చలానా రేట్లు పెంచాలన్నారు.

పట్టుబడిన ప్లాస్టిక్ ఎక్కడ?

ఆదోని మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల పట్టివేత అనంతరం వాటిని ఎక్కడ ఉంచుతున్నారు, తిరిగి ఎక్కడికి చేరుతున్నాయనే విషయంలో స్పష్టత ఇవ్వాలని వైస్ చైర్మన్ నరసింహులు అధికారులను కోరారు. అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌ను తిరిగి సంబంధిత వ్యాపారులు లేదా ఇతర వ్యాపారులకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. పట్టుబడిన ప్లాస్టిక్ కవర్లను కాంపోస్టు యార్డులో భద్రపరిచామని, అందులో ఎలాంటి అక్రమాలకు తావులేదని కమిషనర్ సమాధానంగా చెప్పారు. గతంలో శ్రీనివాసభవన్ నుంచి వన్‌టౌన్ వరకు రోడ్డు వెడల్పు చేశారని, అయితే మళ్లీ యదావిధిగానే దుకాణాలు వెలిశాయన్నారు. అధికారులు కట్టడాలను తొలగించే పనులు చేపట్టాలన్నారు.

అమరవీరుడికి జోహార్లు.

భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల్లో అమరుడైన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని, మురళీనాయక్ జోహార్ అంటూ ఆదోని మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. వీరమరణం పొందిన వీరజవాన్‌కు నివాళులర్పించారు.

రమణీయం.. మహా రథోత్సవం


అశేష జనవాహిని మధ్య రామప్ప, లచ్చప్పల మహారథోత్సవం

నందవరం: గంజహళ్లి మహాత్మ బడేసాహెబ్ ప్రియ శిష్యులు కనకవీడు పేట రామప్ప, లచ్చప్పల జాతర మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం మహారథోత్సవం రమణీయంగా సాగింది. జాతర సందర్భంగా స్వాములకు గ్రామస్తులు పిండి వంటలతో దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అలాగే స్వాములకు తెల్లవారుజాము నుంచే జలాభిషేకాలు, రుద్రాభిషేక పూజలు, ఆకు పూజలు, పుష్పాలంకరణలు గావించారు. సాయంత్రం మహారథంపై ఉత్సవమూర్తులను కొలువు చేసి పురవీధుల్లో అశేష జనవాహిని మధ్య ఊరేగించారు. ఆలయం నుంచి నంది మండపం వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. రథయాత్రలో భక్తులు చుట్టపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వాములకు మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు రథం వద్ద హోమం, ఉత్సవమూర్తులకు పారువేట మహోత్సవం నిర్వహించారు.

వైభవంగా సీతారాముల తిరుగు పెళ్లి


సీతారాములను ప్రభపై ఊరేగిస్తున్న భక్తులు,


ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న వేదపండితులు

- ముగిసిన శ్రీ కోసిగయ్య స్వామి ఉత్సవాలు

కోసిగి: కడపాళెం వీధిలో వెలసిన శ్రీ కోసిగయ్య (ఆంజనేయ) స్వామి ఆలయంలో సీతారాముల స్వాముల తిరుగు పెళ్లి మహోత్సవం మంగళవారం సాయంత్రం కమనీయంగా సాగింది. మూడవ రోజున స్వామి వారికి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుజిత్, దుర్గాప్రసాద్ స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సాయంత్రం ఆలయం నుంచి సీతారామాంజినేయ స్వామి విగ్రహాలను పల్లకీలో కొలువుంచి వేదపండితులు జయతీర్థ ఆచార్, రఘునందన్ ఆచార్‌ల సారథ్యంలో వేదమంత్రాలు పఠిస్తుండగా మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో తేరుబజారు మైదానం వరకు తీసుకొచ్చారు. అక్కడ స్వామి వారికి నారికేలలు కొట్టి హారతులు ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభపై కొలువుంచి రథశాల నుంచి స్వామి వారి పాదాల చెంత వరకు ఊరేగించి తిరిగి యథా స్థానానికి చేర్చారు. అనంతరం పల్లకీలో సీతమ్మ కల్యాణ కట్టపై కొలువుంచి సీతారాములు తిరుగు పెళ్లి వేడుకలను పురస్కరించుకుని స్వామి వారి నిశ్చయ తాంబులాలను భక్తులకు పంపిణీ చేశారు. విగ్రహాలను ఆలయం చెంతకు చేర్చి మూడు రోజుల పాటు కొనసాగుతున్న ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో బసవరాజు దొర, భక్తాదులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతి మహోత్సవం


ఊరేగింపులో కలశాలతో చిన్నారులు, మహిళలు


జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని క్రాంతినగర్‌లో వెలిసిన చౌడేశ్వరిదేవి జ్యోతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తొగటవీర క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్థానిక పేట వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి మహోత్సవం చేపట్టారు. పేటవీరభద్రేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారుల్లో జ్యోతి ప్రజ్వలనతో ఊరేగింపుగా బయలుదేరి క్రాంతినగర్‌లోని చౌడేశ్వరిమాత ఆలయానికి చేరుకున్నారు. చిన్నారులు, మహిళలు కలశాలతో, డోలు సన్నాయిలతో జ్యోతుల ఊరేగింపు కొనసాగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సమ్మెను జయప్రదం చేద్దాం

ఆదోని రూరల్: కార్మిక చట్టాల రక్షణకై ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రద చేద్దామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు జిల్లా నాయకులు వెంకప్ప, ప్రసాద్‌లతో పాటు ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

పోస్టుల మంజూరుపై హర్షం

ఆదోని సెంట్రల్: మున్సిపల్ విద్యా వ్యవస్థ అభివృద్ధికి విద్యాశాఖ చేయూత అందించడం సంతోషంగా ఉందని ఏపీఎంటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఆదోని అధ్యక్షులు అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్‌లలో హెచ్‌ఎం పోస్టులు 104, స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు 2016 మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లాలో మున్సిపల్‌కు ఆరు, మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆరు ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 127 పాఠశాల సహాయకుల పోస్టులు కార్పొరేషన్‌కు, 150 పాఠశాల సహాయకుల పోస్టులను మున్సిపాలిటీకి మంజూరు చేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు, బడుగు బసవరాజు, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్, కోటన్న, చంద్రమౌళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వాన


గోనెగండ్లలో నెలకొరిగిన విద్యుత్ స్తంభం

గోనెగండ్ల : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులు, గాలితో వర్షం కురిసింది. దీంతో మండలంలో అక్కడక్కడ కొన్ని విద్యుత్ స్తంభాలు విరిగిపోగా, మరి కొన్ని నేలకొరిగాయి. మొత్తం 30 స్తంభాలు నేలపై పడ్డాయి. అలాగే ఉరుములు, మెరుపులకు 5 విద్యుత్ ట్రాన్స్‌ఫర్మార్లు కాలిపోయాయి. దీంతో సోమవారం రాత్రి మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ రావు సిబ్బందితో కలిసి మంగళవారం మండలంలో నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మరమ్మతు పనులు చేస్తున్నామని తెలిపారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ

ఆదోని టౌన్: పట్టణం పాత బస్టాండు సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌లను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. ఓవర్ బ్రిడ్జి కింద రెండు అన్నా క్యాంటీన్‌లను పరిశీలించారు. క్యాంటీన్లలో తయారు చేసిన అల్పాహారం నాణ్యతగా, రుచికరంగా ఉందా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా జియారత్ వేడుకలు


గంధం తీసుకుని వస్తున్న దృశ్యం


దర్గాలో విన్యాసం ప్రదర్శిస్తున్న పక్కీర్

కౌతాళం: మండలకేంద్రమైన కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జియారత్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ముందుగా దర్గాలో ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేసి స్వామి సమాధికి ధర్మకర్త ఇంటి నుంచి వచ్చిన గంధాన్ని పూశారు. అనంతరం స్థానికంగా ఉన్న పక్కీర్లతో ప్రత్యేక ఖవ్వాలి పోటీలను నిర్వహించారు. పక్కీర్ల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆనవాయితీ ప్రకారం విన్యాసాల అనంతరం వారిని బ్యాండు మేళాలు డప్పు వాయిద్యాల మధ్య పక్కీర్ల కట్టా వద్దకు ఊరేగింపుగా వెళ్లి సాగనంపారు. భక్తులతో పాటు గ్రామస్తులకు కూడా మంగళవారం ప్రత్యేక భోజన కార్యక్రమాలను లంగర్‌ఖానాలో ఏర్పాటు చేశారు. కొత్తగా శిష్యరికం పొందిన వారికి తీర్థంను అందజేశారు. ఉత్సవాలు ఘనంగా జరగాడానికి సహకారం అందించిన రెవెన్యూ, పోలీసు, పంచాయతీ శాఖలతో పాటు గ్రామస్తులకు ధర్మకర్త కృతజ్ఞతలు తెలిపారు.

ఈచనాల్‌లో ప్రత్యేక ఫాతెహాలు

మండలంలోని ఉరుకుంద గ్రామానికి మజరా గ్రామమైన ఈచనాల్ వద్ద మంగళవారం ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు, శిష్య బృందంతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఖాదర్‌లింగస్వామి తపస్సు చేసిన ప్రాంతంగా ఇక్కడ గుర్తింపు ఉండడంతో ఉరుసు చివరి రోజు ఈ కట్టా వద్దకు చేరుకుని ఫాతెహాలు, ప్రార్థనల అనంతరం అక్కడ జెండాను ఎగురవేశారు.

ఘనంగా అల్లీపీరాసాహెబ్ ఉరుసు


ప్రవచనం వినిపిస్తున్న పీఠాధిపతి గురు గాజీహుసేన్‌సాహెబ్‌పీరా స్వాములు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరా సాహెబ్ స్వాముల ఉరుసు మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు పీఠాధిపతి గురు గాజీహుసేన్‌సాహెబ్‌పీరా స్వాములు స్వామివారి ప్రవచనాలను వినిపించగా.. భక్తులు శ్రద్ధగా విన్నారు. ఉదయం పీఠాధిపతి ఇంటి నుంచి గంధంను ఉరేగింపుగా గ్రామ పురవీధుల గుండా దర్గాకు చేరుకుంది. గంధం దర్గాకు చేరుకున్నప్పటి నుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తులు పీఠాధిపతి ఆశిస్సులు తీసుకున్నారు. వేసవి ఎండ నుంచి ఉపశమనం కోసం ఉరుసుకు వచ్చిన భక్తులకు చలువ పందిళ్లను ఏర్పాటు చేయటంతో ఉపశమనం పొందారు. లక్షకు పైగా భక్తులు ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నట్లు తెలుస్తుంది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా రూరల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తీ నిర్వహించారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదల గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిరంజీవి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను జూన్ 10 నాటికి పూర్తి అయ్యేల చొరవ తీసుకోవాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకొని వారి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీవో బంగారమ్మ, హౌసింగ్ సిబ్బంది, సచివాయల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 12 లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

గోనెగండ్ల : ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు అదనంగా ప్రభుత్వం చెల్లించే బిల్లును సద్వినియోగం చేసుకొని జూన్ 12 లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ టి. చిరంజీవి సూచించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఇళ్ల నిర్మాణాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 404 ఇళ్లు టార్గెట్ ఇవ్వడం జరిగింది. ఇందులో 93 ఇళ్లు పూర్తి కాగా, మిగతా 311 ఇళ్ల నిర్మాణాలను జూన్ 12వ తేదీ నాటికి పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణి మంజరి, హౌసింగ్ ఏఈ షేక్షావలి పాల్గొన్నారు.